క్లుప్తంగా

ఆశ వర్కర్ల ఆందోళన



ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

విజయనగరం ఫోర్ట్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు బొత్స సుధారాణి మాట్లాడుతూ ఆశ వర్కర్లు జీతాలు పెంచాలన్నారు. పని భారాన్ని తగ్గించాలని కోరారు. ఆశ వర్కర్లపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎంపీడీవో పర్యటన



జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో గిరిబాల

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి, తమ్మాపురం గ్రామాల్లో ఎంపీడీవో గిరిబాల మంగళవారం పర్యటించారు. జగనన్న సురక్ష సర్వేతో పాటు పాఠశాలల్లో జరుగుతున్న నాడు – నేడు పనులను పరిశీలించారు. సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పక్కాగా సర్వే చేయాలని సిబ్బందికి ఆదేశించారు. వాళ్లకి అవసరమైన ధ్రువపత్రాలను మంజూరు చేసేందుకు కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు నేడు పనులు నిర్దిష్ట వ్యవధిలోగా పూర్తి కావాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న తోడుతో చిరు వ్యాపారులకు భరోసా



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని తిలకిస్తున్న చైర్‌పర్సన్ సరోజిని తదితరులు

నెల్లిమర్ల రూరల్: జగనన్న తోడుతో చిరు వ్యాపారాలకు ఆర్థిక భరోసా కలిగిందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని పేర్కొన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో జగనన్న తోడు నిధుల జమ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులతో కలిసి మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని తిలకించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగనన్న పరిపాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మెన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, కార్పొరేషన్ డైరెక్టర్ నాపాడ శ్రీను, జేసీఎస్ కన్వీనర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పూసపాటిరేగ: మండలంలోని పలు ఎరువుల దుకాణాలును వ్యవసాయ శాఖ అధికారి కొల్లి నీలిమ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. మండలంలోని పేరాపురంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. విత్తనాల శాంపిల్స్‌ను పరిశీలించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ఎరువులు, పురుగు మందులు ఎంఆర్‌పీ ధరలు కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

థాంక్యూ సీఎం సార్

శృంగవరపుకోట: ఇచ్చిన మాటకు కట్టుబడి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడమే కాకుండా హయ్యర్ పెన్షన్, ఇతర సదుపాయాలు కల్పించినందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ఆర్టీసీ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో థాంక్యూ సీఎం సార్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సీఎం జగన్ ఫొటోకు ఆర్టీసీ ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు. ఆర్టీసీ అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి తగ్గట్టుగా పనిచేస్తామని ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. డిపో మేనేజర్ కె.రమేష్, ట్రాఫిక్, గ్యారేజ్, ఆఫీస్, సెక్యూరిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు విత్తనాల కిట్ల పంపిణీ

బొండపల్లి: మండలంలో ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విత్తనాల కిట్లను బుధవారం పంపిణీ చేయనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ప్రతినిధులు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు 15 రకాల వ విత్తనాలను ఎస్సీ రైతులకు ఉచితంగా అందిస్తారని పేర్కొన్నారు.

ఆయా పోస్టుకు దరఖాస్తులాహ్వానం

మెరకముడిదాం: బోడందొరవలస అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చీపురుపల్లి ఐసీడీఎస్ పీవో రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టును బీసీ–ఇకి కేటాయించినట్లు పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 21 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు ఉన్న స్థానిక వివాహితలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

నగర అభివృద్ధే లక్ష్యం



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- 37వ డివిజన్‌లో రూ.47.30 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధే .చేయటమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. నగరంలోని 32వ డివిజన్‌లోని రూ.47.30 లక్షలతో నిర్మించ తలపెట్టిన అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మంగళవారం శంకుస్థాపనలు చేసి ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని సిద్ధార్థ నగర్, నరసింహ నగర్, మౌర్య జంక్షన్, నాయుడు కాలనీ ప్రాంతాలలో రహదారులు కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక సమస్యలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయించడంతో పాటు పనులు ప్రారంభానికి చొరవ చూపినందుకు స్థానికులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జిలు రెడ్డి గురుమూర్తి, మారం బాల బ్రహ్మారెడ్డి, నాయకులు భోగాపురపు రవిచంద్రలు మాట్లాడుతూ నగరంలో అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చూపుతున్న కృషి అభినందనీయం అన్నారు. 32 డివిజన్‌లో రూ.47.30 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే ప్రధాన జంక్షన్‌లు నగరానికి శోభను తెచ్చిపెట్టాయన్నారు. శివారు ప్రాంతాలతో పాటు సమస్య ఎక్కడ ఉంటే అక్కడ పరిష్కరించే దిశగా ఆయన శ్రమిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో నగరం మరింత అభివృద్ధి చెందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగమోహన్ రెడ్డిని, శాసనసభ్యులుగా కోలగట్ల వీరభద్ర స్వామిని ప్రజలు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్, స్థానిక కార్పొరేటర్ భోగాపురపు లక్ష్మి, బొద్దాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలో స్వర్ణయుగ పాలన

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి
- 23వ సచివాలయంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయ యాదవ్

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రంలో స్వర్ణయుగ పాలన సాగుతోందని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పేర్కొన్నారు. నగరంలోని 23వ డివిజన్ 27 నంబరు సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చులయా యాదవ్ పాల్గొన్నారు. తమ ప్రాంతంలో వీధి దీపాల సమస్య ఉన్నట్లు స్థానికులు చెప్పగా వెంటనే సమస్య పరిష్కారానికి తగు చొరవ చూపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతుందన్నారు. నగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అభివృద్ధి కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రజల పక్షాన నిలిచి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు శంకుస్థాపనల మాస మహోత్సవాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. అందరి సహకారంతో నగరం మరింత అభివృద్ధి చెందే విధంగా కృషి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శశి భార్గవి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేదార్ శెట్టి లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో ఇబ్బందులు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- బిల్లుల మంజూరులో జాప్యం లేకుండా చూడండి
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఇళ్ల నిర్మాణాలలో ఎదురవుతున్న క్షేత్ర స్థాయి ఇబ్బందులను పరిష్కరించాలని విజయనగరం కార్పొరేషన్, గృహ నిర్మాణ సంస్థ అధికారులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా డివిజన్‌ల వారీగా లబ్ధిదారుల సమస్యలను వెల్లడించినట్లయితే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఇప్పటికే గుంకలాం, కొండకరకం ప్రాంతాలలో నిర్మించిన ఇళ్లకు అవసరమైన తాగునీటి సదుపాయాలను కల్పించాలని సూచించారు. గృహ లబ్ధిదారులకు బిల్లులు మంజూరులో జాప్యం జరుగుతుందని కొంతమంది కార్పొరేటర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై సత్వర పరిష్కారం చూపే విధంగా గృహ నిర్మాణ సంస్థ అధికారులు చొరవ చూపాలని డిప్యూటీ స్పీకర్ చెప్పారు. సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తాము చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో కార్పొరేషన్‌లో సబ్ కమిటీల ఏర్పాటు జరిగిందన్నారు. అందులో హౌసింగ్ కమిటీ ఒకటని, క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను హౌసింగ్ కమిటీ దృష్టికి తెచ్చినట్లయితే సమస్యల పరిష్కారానికి వీలుంటుందని అన్నారు. అపరిష్కృతం కాని అన్ని సమస్యలను క్రోడీకరించి ఈ నెల 22వ తేదీన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. ఏ సమస్యలున్న పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. తాగునీటి కుళాయిలకు దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. ఇప్పటికే తాగునీటి సమస్యకు పరిష్కారం చూపామన్నారు. తారకరామ తీర్థసాగర్ పూర్తయితే రానున్న 40 ఏళ్లకు నగరంలో తాగునీటి సమస్య ఉండదని చెప్పారు. తాము చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అవినీతి లేకుండా పూర్తి పారదర్శకంగా జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్, కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీ రాజేష్, కోఆప్షన్ సభ్యులు ఆశపు వేణు, హౌసింగ్ కమిటీ సభ్యులు గాదం మురళి, మారోజు శ్రీనివాసరావు, జోనల్ ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ సిబ్బంది, గృహ నిర్మాణ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ఏళ్లనాటి కల సాకారమైంది ఇలా...

- గాజులరేగలో రూ.30 లక్షలతో తాగునీటి కుళాయిలు
- ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 50వ డివిజన్ గాజులరేగ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల నాటి కల సాకారమైంది. నగర శివారుల్లో ఉన్న కాలనీ ఏర్పాటైనప్పటి నుంచి తాగునీటి కుళాయిలు లేక స్థానికులు అవస్థలు పడేవారు. సమస్యను స్థానికులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దృష్టికి తెచ్చిన వెంటనే ఇంటింటికి కుళాయి కనెక్షన్ల ఏర్పాటుకై అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రూ.30 లక్షలతో కుళాయిలను ఏర్పాటు చేసి మంగళవారం ప్రారంభించారు. దీంతో స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, 21వ డివిజన్ కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు మాట్లాడుతూ గాజులరేగలోని బసవతారకం కాలనీలో తాగునీటి కష్టాలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల కృషితో చెక్ పడిందన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, జోనల్ ఇన్‌చార్జి బోడసింగి ఈశ్వరరావు, కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, కనుగుల రాజా తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి మొహరం ఉత్సవాలు

విజయనగరం టౌన్: పవిత్ర మొహరం ఉత్సవాలు ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకూ జరుగుతాయని పట్టణ శాఖ ముస్లింల ప్రతినిధి మహమ్మద్ గౌస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సున్నీ మసీదుల్లో ముస్లిం సోదరులు అంతా మొహరం ప్రత్యేక ప్రార్థనలను నిర్వహిస్తారన్నారు. ఉత్సవాల నేపథ్యంలో ముస్లింలు పీర్లను బయటకు తీయరాదని, ఊరేగింపులు నిర్వహించడం నిషేధం చేయాలని విజ్ఞప్తి చేశారు.

29న భారత్ బచావోపై సమావేశం

విజయనగరం టౌన్: భారత్ బచావో జిల్లా మహాసభలు ఈ నెల 29న నిర్వహించనున్నట్టు జిల్లా కమిటీ కన్వీనర్లు కరీం, షణ్ముఖరావు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఉన్న ప్రజా గ్రంథాలయంలో మంగళవారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం ఏర్పాటైన భారత్ బచావో సంస్థ దేశ వ్యాప్తంగా ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కె.సోములు, అశోక్, అంబేద్కర్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

విజయనగరం: పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్య వైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు సంఘం అధ్యక్షుడు వెత్సా సత్యన్నారాయణ మూర్తి, బలభద్రుని చెన్నయ్య శెట్టి తెలిపారు. ఈ మేరకు మంగళవారం సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కరపత్రాలు వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే నెల 15వ తేదీ మంగళవారం సాయంత్రం ఉల్లి వీధి వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి మాచర్ల చంద్రశేఖర్ గుప్త మాట్లాడుతూ పదవ తరగతిలో 85 శాతం సాధించిన విద్యార్థులతో పాటు ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థులు కూడా ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. సంఘం భవనంలో దరఖాస్తులు లభిస్తాయని తెలిపారు. ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తులు సంఘం భవనంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో కట్టమూరి రత్నారావు, ఉపేంద్ర, వజ్రపు కృష్ణారావు, చెన్నా బుచ్చి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ సూర్యకుమారి

భోగాపురం: విద్యార్థినులు చట్టాలు, ఆత్మరక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ సూర్యకుమారి అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలు, ఆత్మరక్షణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యపై దృష్టి సారించి నిర్దేశించుకున్న లక్ష్య సాధనకై నిరంతరం శ్రమించాలన్నారు. సమాజంపై సరైన అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సామాజిక మాధ్యమాల వినియోగంపై అప్రమత్తతతో వ్యవహరించాలని, అవసరం మేరకు మాత్రమే వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఎవరికైనా ఏమైన సమస్యలు ఎదురైనప్పుడు పోలీసులను సంప్రదిస్తే వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక 'జగనన్న సురక్ష'

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. పలుచోట్ల మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయా సభల్లో ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నెల్లిమర్ల రూరల్: రామతీర్థంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, ఎంపీపీ సుధారాణి



నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీలోని గాంధీనగర్ కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని



పూసపాటిరేగ: చల్లవానితోటలో ధ్రువపత్రాలు అందచేస్తున్న జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, సర్పంచ్ పతివాడ వరలక్ష్మి, ఎంపీడీఓ, తహసీల్దార్ తదితరులు



భోగాపురం: ధ్రువపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు



విజయనగరం రూరల్: నారాయణపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు



డెంకాడ: గుణుపూరుపేటలో లబ్ధిదారులకు పత్రాలను అందిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, జెడ్పీటీసీ లక్ష్మి

వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలకు పెద్దపీట



మాట్లాడుతున్న కస్తూరి, మహిళా ప్రజాప్రతినిధులు

కొత్తవలస: పదవుల్లో, సంక్షేమ పథకాల్లో అన్నింటా మహిళలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మూకల కస్తూరి అన్నారు. మండంలోని అర్ధన్నపాలెం గ్రామ సమీపంలోని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంపు ఆఫీస్‌లో మహిళాప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకురాలు వంగలపూడి అనిత స్థాయి మరచి ముఖ్య మంత్రి, ఆయన కుటుంబ సభ్యుల గురించి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహిళా సంక్షేమం, సాధికారతే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వ, నామినేట్ పదవుల్లో సగం మహిళలకే సీఎం జగన్ కేటాయించారన్నారు. మహిళలను తన సొంత అక్కచెల్లెళ్లుగా భావించి వారు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో అనేక పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. మహిళల రక్షణ కోసం దిశ చట్టం చేసి ప్రత్యేక పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగనన్నదేనని అన్నారు.అనిత నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే మంచిదని, లేకుంటే తగిన మూల్యం చెల్లించకోక తప్పదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ఎల్.కోట మండల మహిళా విభాగం అధ్యక్షురాలు దేగల సాయిలక్ష్మి మాట్లాడుతూ వంగలపూడి అనిత వ్యవహార శైలి మహిళాలోకాన్ని అవమానపరిచే తీరుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె తీరుపై సోషల్ మీడియాలో జరిగే ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం తగదన్నారు. కొత్తవలస ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, ఎల్.కోట వైస్ ఎంపీపీ ఆవాల శ్యామల, కొత్తవలస మేజర్ పంచాయతీ వైస్ సర్పంచ్ పొనగంటి మంగవేణి, కొత్తవలస సెగ్మెంట్ –4 ఎంపీటీసీ పి.అనూష, ఆదిరెడ్డి భారతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నెల్సన్ మండేలా జయంతి



నెల్సన్ మండేలా జీవిత విశేషాలను వివరిస్తున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా జయంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. కేశవరావు మాట్లాడుతూ నెల్సన్ మండేలా దక్షిణాఫ్రికాలో జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, 26 ఏళ్ల కారాగార శిక్ష అనుభవించారన్నారు. ఆయన గాంధీజీ ప్రభోదించిన శాంతియుత మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకుని అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ రవీంద్రనాథ్, వలీఖాన్, ఆర్.శ్రీలక్ష్మి, పి.భాస్కర్, సీహెచ్.శ్రీనివాసరావు, బి.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.